# ఇదేం న్యాయం!?

అది నగరం కాదు.

ప్రక్క ఇంట్లో ఎవరున్నారో తెలుసుకోకుండా వుండే వీలులేదు.

అది పల్లె కాదు.

ఊళ్ళోకి వచ్చిన కొత్త మనిషి పుట్టు మచ్చలతోసహా అంతా అంతు పట్టించుకొనే అవకాశం లేదు.

చిన్న నగరం. పెద్దపల్లె, ఒక మాదిరి బస్తీ. తిరుపతి అనొచ్చు.

ఆ ఊళ్ళో న్యూ కాలనీ నిజంగా కొత్తగా కట్టింది. న్యూఢిల్లీ లాగా పాతది కాదు.

ఇంటికీ ఇంటికీ దూరం వున్నా కూర వండితే వాసన వస్తుంది. పిలిస్తే వినిపిస్తుంది. అంత దగ్గర. పోనీ అంత దూరం.

న్యూ కాలనీలో రామశాస్త్రి పేరు వినని వాళ్ళు ఉండరు.

అతడికి అంత ప్రసిద్ధి. దానికి కారణం లేకపోలేదు. ఆయన అంత ఛంధశ్శాసనుడు. హెడ్మాస్టరుగా మునుపు జిల్లా బోర్డులో, ఇప్పుడు జిల్లా పరిషత్తులో.

అతడి ప్రసిద్ధికి ఇంకో కారణం వుంది. ఆ కారణం అతడి కొడుకు ప్రభాకర శాస్త్రి. ఒక్కడే కొడుకు. అయితే ఏం ఫర్వాలేదు.

తండ్రి పేంటు వేసుకొని సిగరెట్ తాగుతున్న ఈ కాలంలో ప్రభాకర శాస్త్రి ఆకారం బి.ఏ. చదివే అబ్బాయికి తగినట్లుగా వుండదు.

పేంటు వేసుకోడు, పంచ కట్టుకొంటాడు. అదీ మూడు మూరలది.

చొక్కా వేసుకోడు. బనీను వేసుకొంటాడు. అది బనీనూ కాదు. పొట్టి చొక్కా, పొడుగు బనీను.

తలమీద పొడుగు పిలక. ముడి వేసుకొంటాడు. పొట్టిదై కూర్చుంటుంది.

ముఖాన ఇంత బొట్టు.

ఏం పూజో పూజ! వీడివి ఈ కాలం పిల్లల బుద్ధులు కావు అని తండ్రి వాపోతూ వుంటాడు.

రామశాస్త్రి ప్రసిద్ధికి మరో కారణం భార్య.

లక్ష్మీదేవి లాగా వుంటుంది. పేరు కూడా లక్ష్మి.

పవిత్రతకు పెట్టిన పేరుగా, పుట్టిన రూపంగా వుంటుంది లక్ష్మి. ఉపవాసాలు, వారాలు, ఒక్కపొద్దులు, ఉండీ ఉండీ ఆమె వూపిరి లేని వెలుతురుగా మారిపోయింది.

ఆమె బయట కనిపించేది అబ్బురం. ఉదయం తులసి కోట. సాయంత్రం ఎప్పుడైనా వరండా. అంతే.

రామశాస్త్రి ప్రసిద్ధి ఇవన్నీ స్వల్ప కారణాలు. అయితే ప్రబల కారణం మరొకటి వుంది.

అది ప్రక్క యిల్లు.

అందులో డేనియల్ వుంటున్నాడు. అంటే ఒక్కడే ఉండటం లేదు. కుటుంబంతోనే. చేసేది పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం. అతడిది ఏం నోరో తెరిస్తే బూతుల పుట్ట.

'ఏం శాస్త్రీ! నా వుద్యోగంలో విశేషం చెప్పనా! నేనెంత పెద్దగా, మాంచి రంజుగా, క్లాస్‌గా బూతులు తిడితే నేనంత గొప్ప!'

రోడ్డుమీద పదినిమిషాలు నిలబడి ప్రాణప్రదంగా సిగరెట్లు కాల్చుకొని కబుర్లుచెప్పుకొని కదలి పోతూండడం వాళ్ళ రివాజు. శాస్త్రి కనబడకపోతే డేనియల్, డేనియల్ కన్పించక పోతే శాస్త్రి, యింటికి పోయి పలకరించి రావటం ఎప్పుడైనా వుంటే వుండవచ్చు.

న్యూకాలనీలో నీళ్ళమైత్రికి కారణం ఏమిటో ఎవరికీ తెలియదు. పోనీ; వాళ్ళకూ తెలియదు.

డేనియల్ భార్యటీచరు. ఉదయం పోతుంది. సాయంకాలం వస్తుంది. ఎప్పుడూ ఎండలోనూ వానలోనూ ఏమున్నా లేకున్నా ఆమె వుంటే చేతిలో

గొడుగుఉంటుంది. ముడిచిన గొడుగు చేతిలో వుంటుంది. ముడిచిన గొడుగు లాగ ఆమె వుంటుంది. ఆమె వస్తుంటే రెండు గొడుగులు వస్తున్నట్లు.

డేనియల్ కూతురు పేరు లత బి. ఏ., చదువుతూవుంది. డేనియల్‌కి ఏమనిపించిందో ఏమో! అంతటితో ఫుల్‌స్టాప్ పెట్టించేశాడు. అంతే సంసారం. అత్తెసరు సంసారం. ఆ అమ్మాయికి తలకాయ వుందో లేదో కాని ముఖం పైకె త్తడంతెలీదు.

ఆదివారం వస్తే ఒక చక్కని సన్యాసినిలా తయారై ఏం చర్చోఏమో పోయిందే పోవటం. సన్యాసిని అంటే కాషాయంబర ధారికాదు. వెన్నెల అంబర ధారి.

వీళ్ళు గుడికి పోతారు.

వాళ్ళు చర్చికి పోతారు.

వీళ్ళు కూరగాయలు వండు కొంటారు.

వాళ్ళు మాంసం వండు కొంటారు.

వీళ్ళు మంత్రాలు.

వాళ్ళు కీర్తనలు.

వాళ్ళకూ వీళ్ళకూ మధ్య ఏ సంబంధమూలేదు.

అయితే స్నేహం!

ఏమిటా స్నేహం?

"ఏం లక్ష్మమ్మా" అంటూ మేరివస్తుంది.

"ఏం మేరమ్మా" అంటూ లక్ష్మమ్మ పోతుంది.

కబుర్లాడు కొంటారు. కాలక్షేపం అవుతుంది.

ఈ యిద్దరు ఆడవాళ్ళు, ఆ యిద్దరు మగవాళ్ళనీ "ఏం అన్నయ్యా వదిన లేదా?"" అంటే "లేకేం వుందమ్మా" అనే సమాధానం వస్తుంది.

వాళ్ళ స్నేహానికి పెద్దకారణమూ లేదు.

వాళ్ళు విరోధంగా వుండటానికి పెద్ద అవసరమూ లేదు.

"క్రోణ్ణి కోసినట్లున్నారు" అంటే "అబ్బేలేదు ఉల్లిపాయలు కోసింది" అంటాడు డేనియల్. నవ్వుకొంటారు.

లక్ష్మితోటలో కాసిన చిక్కుడు గాయలు పంపితే, మేరి టొమాటోలు పంపుతుంది.

వాళ్ళకూ వీళ్ళకూ పాలవాడు ఒక్కడే!

వంట పనిచేసే ఆడవాళ్ళూ ఒక తల్లిపిల్లలే.

పేపరువాడు అటునుంచివస్తే అక్కడ వేసి ఇక్కడికి. ఇటునుంచి పోతే ఇక్కణ్ణుంచి అక్కడికి.

పేపరు రాకపోయినా, పాలు రాకపోయినా బియ్యం పప్పు అవసరమైనా రెండిళ్ళ మధ్యా సరఫరా సజావుగానే సాగుతుంది. కానీ—

వాళ్ళు వీళ్ళ ఇంటిలో అన్నం తినలేదు. వీళ్ళు వాళ్ళ ఇంటిలో కాఫీ తాగ లేదు. అయితే—

వీళ్ళు వాళ్ళ నేమీ అనలేదు. అనరు. అనవలసిన అవసరం రాదు.

వాళ్ళు వీళ్ళతో పేచీ పడే పనిలేదు. పూచీ పడే రాజీ లేదు. మామూలుగా వుంటుంది.

కానీ—

ఈ ఉద్యోగులిద్దరూ ఒక అగ్గి పుల్లతో రెండు సిగరెట్లు ముట్టించుకోవటం వీధి చూచింది.

డేనియల్ మోటర్ సైకిల్ మీద వెనుక కూర్చొని రామ శాస్త్రి స్కూల్‌కి పోవటం న్యూకాలనీ చూచింది.

'భలేవాళ్ళే' అంటే 'భలేవాళ్ళే' అనుకొంటూ షేక్‌హాండు లిచ్చుకోవటం ఊరు చూచింది.

డేనియల్ కుక్కను పెంచు కొంటున్నాడు. అది బొచ్చు కుక్క. అది అరుస్తుంది. కాని కరవదు. కరవ కూడదని దానికి తెలుసు. అది అవసరమైతే అరుస్తుందనీ, అసలు కరవనే కరవదని శాస్త్రికి ఇష్టం.

అందువల్లే న్యూకాలనీ మూల మీద వీధి కుక్క ఈనితే బొచ్చున్న కుక్క పిల్లని చూచి, తెచ్చి పెంచు కుంటుంటే, మూడో రోజున దానికి అర్జెంటుగా అరెస్టు వారెంట్ వచ్చి చచ్చి స్వర్గంలో ఉంది.

అది మన కచ్చి రాలేదను కొన్నాడు శాస్త్రి.

మేరికి బాగుందని పించి తులసి మొక్క తెచ్చి, నాటి, నీళ్ళు పోసి, చుట్టూ గోడ కట్టి, అపురూపురు మని పెంచుతుంటే తులసి మొక్కకు ఏం పొయ్యే కాలం వచ్చిందో వూపిరి పీల్చకుండా ప్రాణాయామం పట్టి కళ్ళు తేలేసి చచ్చి సరదా పడి మట్టిలో కల్సిపోయింది.

ఇదేందో కలిసి రాలేదని మేరి వూరు కొంది.

ఒక రోజు ఇంటిముందు పనివాడు నీళ్ళు చల్లుతున్నాడు. పని పిల్ల ముగ్గుతో సిద్ధం. డేనియల్ "ఓర్నీ దొంగా—ఇదేందిరా రొచ్చు రొచ్చు ఛాలే" అంటూ వెళ్ళాడు.

అది తిట్టటమూ కాదు. నీళ్ళూ ముగ్గూ వద్దనటమూ కాదు. అదంతే. ఏమనందే తనకేమీ తోచదు.

అంతదాకా లక్ష్మి చూచింది. అందులో వింతాలేదు. విడ్డూరమూ లేదు.

అప్పుడు లతవచ్చి పని పిల్ల దగ్గర నుంచి ముగ్గు తీసుకొని అల్లి బిల్లిగా మల్లెతీగలా పిల్లగువ్వలా ఉంగరాలు తిరుగుతూ ముగ్గులు చుడుతూ వుంది.

లక్ష్మి మురిసి పోయింది.

డేనియల్ చూసి "ఏందీ వంకర గీతలు" అని దూక్కుంటూ వెళ్ళి పోయాడు.

తెల్లటి చీర కట్టుకొని, నల్లటి బైబిల్ గుండె కొత్తుకొని లత ఆదివారం చర్చికి పోయింది.

చిన్నప్పట్నుంచి లక్ష్మికి లంగాలత తెలుసుకానీ, చీర లత తెలియదు. ఆమె నిలబడి చూస్తుంటే ప్రభాకర శాస్త్రి కూడా అదే పనిగా చూస్తూవున్నాడు.

బైబిల్ చూస్తూ ఆ నల్లటిదాంట్లో ఏముందో అని విద్యార్థిలాగా ఆలోచించ సాగాడు.

ఆ రోజు సాయంకాలం ఇంటికొస్తూ బైబిల్ తెచ్చాడు.

"ఏమిటి? అది ఎందుకూ?" అంది లక్షి.

"ఎందుకా? ఇది లత గుండెకు అంతదగ్గరగా వుంటుంది కదా! ఇందులో ఏముందో చూద్దామని" అన్నాడు.

లక్ష్మి తెరిచిన నోరు నొక్కుకోవటం మరచిపోయింది.

ప్రభాకరశాస్త్రి మొలిచిన గడ్డాన్ని మీసాన్ని చులకన చేయటంవల్ల ముఖమంతా వంకర వంకరగా అల్లిబిల్లిగా,అల్లిరిబిల్లిరిగా మెలికలు తిరిగి కష్ట పెట్టేశాయి.

వాటి శాపం తగలక ముందు ప్రభాకరశాస్త్రి దృష్టిలో లత ఒకప్రాణి ఇప్పుడు లత ఒక అందమైన అమ్మాయి.

లత కాలేజీకి పోతుంటే గేటులో నిలబడి చూస్తున్న ప్రభాకరశాస్త్రిని లక్ష్మి చూసి "ఎందుకురా అలా చూస్తావు?" అంటే, 'ఎందుకూ!' అంటూ వెళ్ళిపోయాడు.

ఒక రోజు లత వేపపుల్ల కోసం ఎగురుతున్న శాస్త్రిని చూచి నవ్వింది.

'ఎందుకు నవ్వుతావు?' అంది మేరి.

లత చెప్పనూలేదు. నవ్వు ఆపనూ లేదు.

నీళ్ళ బిందెతో వస్తున్న లత కాలు జారికి మెట్ల మీద కూర్చొబడటం చూచిన శాస్త్రి పగలబడి నవ్వుతున్నాడు.

"ఎందుకురా నవ్వుతున్నావు?" అని లక్ష్మి అడిగితే "పగిలింది బిందె?" అని ఒకటే నవ్వటం.

ఒక రోజు లత మేరిని అడిగింది.

"వాళ్ళు బీదవాళ్ళా"

"కాదు."

"మరి వాళ్ళబ్బాయికి ప్యాంట్లు కుట్టించరేం? కాలేజీలో ఎలా వుంటాడో తెలుసా? అందరూ నవ్వటమే."

"నోరు మూసుకో. నీకెందుకా సంగతి?"

దానితో లత నోరు ఎత్తలేదు. ముఖమెత్త లేదు.

వెళుతున్న లతను చూస్తూ మేరీ అంది.

"శాస్త్రి ఎంత మంచివాడు. ఎంత నిష్ఠ"

లత వింటూ వెళ్ళిపోయింది.

లత అరవై పౌనులున్నప్పుడు శాస్త్రిని చూసిన గుర్తేలేదు. నూటపది పౌనులయ్యేసరికి శాస్త్రి కళ్ళలోనే కాపురం పెట్టుకొన్నాడు.

శాస్త్రి వీధి చివర నిలబడి లతవస్తుంటే చూస్తున్నాడు.

తెల్లటి చీర!

తెల్లటి రవిక! తలలో పూలు లేవు!

నుదుట బొట్టు లేదు!

చేతులకు గాజులు లేవు.

మెళ్ళో తాళి లేదు.

శాస్త్రి మనస్సు చివుక్కుమంది. కలుక్కుమంది. కెవ్వుమంది. కేరుమంది.

ఆ సాయంకాలం ఇంటికి వచ్చి చిక్కుడుగాయలు తరుగుతూవుంటే, సహాయంగా పీచు తీస్తూ "అమ్మా" అన్నాడు.

లక్ష్మి "ఏం?" అన్నట్టు తలూపింది.

తలొంచుకున్న శాస్త్రి మళ్ళీ పిలిచాడు,

"అమ్మా!"

"ఏంరా?"

"మరే"

"ఏరా"

"మరే"

"చెప్పరా"

"లతకు భర్త పోయాడా?"

"ఛీ! ఏం మాటల్రా అవి. పసిది పాపం పెళ్ళే కాలేదు!"

"అది కాదమ్మా"

"ఏమిట్రా"

"మరి అలావుంటుందేం?"

"పాపం! ఆ పిల్లకు భక్తి ఎక్కువ" శాస్త్రి అక్కణ్ణుంచి గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. రెండోరోజు కాలేజీలో శాస్త్రి లత ఎదురుపడ్డాడు.

"మిమ్మల్నే" ఇద్దరూ అన్నారు.

"ఊఁ" ఇద్దరూ పలికారు.

"మాట" అన్నారు, ఆగారు.

"మీ వరస నాకేం నచ్చటం లేదు!" అన్నారు.

"నా యిష్టం" అందామనుకొన్నారు. కానీ అలా అనలేదు.

"ఏం?"

"ఇలా వుండరాదు"

"ఎలా వుండాలో"

"ఇలా కాదు"

"ఎలా?"

"చెప్తా"

ఇద్దరూ అనుకొన్నారు.

ఇద్దరూ వెళ్ళిపోయారు.

రెండు విచిత్ర జంతువులు మాట్లాడుకొంటున్నాయని కాలేజీ అంతా విరగబడి చూచింది.

ఆదివారం మధ్యాహ్నం లక్ష్మి పిండారబోసుకుంటుంటే మేరే వచ్చింది. వరండాలో లోకాభిరామాయణంలో రాముడూ వచ్చాడు. సీతా వచ్చింది. ఇద్దరూ వెళ్ళిపోయారు.

ఇంకా ఇద్దరూ మాట్లాడుకొంటుంటే మాటల్లోకి ప్రభాకరశాస్త్రి వచ్చాడు. లతా వచ్చింది.

అంతలో ఇంట్లోకి వాళ్ళిద్దరూ వచ్చారు.

ఒకర్నొకరు చూచుకొని ఇద్దరూ వెళ్ళిపోయారు.

శాస్త్రి పేంటు వేసుకొంటే బాగుంటుంది కదా అని లత అడిగిందని మేరి చెప్పి ఒకటే నవ్వటం!

లక్ష్మి నవ్వింది.

"లతచేత పూలుదండ కుట్టించుకోరాదూ" అని శాస్త్రి అన్నాడని లక్ష్మి చెప్పింది.

ఇద్దరూ నవ్వుకొన్నారు.

లత పుస్తకాలు మోయలేక మోయలేక మోసుకొంటూ పడుతూ లేస్తూ పోతూవుంటుంది.

శాస్త్రి గేటులో నిలబడి 'లతా' అన్నాడు.

లత రోడ్డు మీద ఆగి 'ఏమండీ ?' అంది.

"ఇటురా !"

దగ్గరకు పోయింది.

గేటు తీశాడు.

లోపలికి నడిచాడు.

వెంట నడిచింది.

తన గది లోకి పోయాడు.

లోపలికి పోయింది.

తలుపు వేశాడు.

లత ఎగాదిగా చూసింది.

మత్తు సువాసన వెదజల్లే కమ్మని మల్లెల దండలు దండిగా తలలో తురిమాడు.

నవ్వింది.

పిడికెడు కుంకుమ తీసుకొని నుదురంతా పామిపెట్టాడు.

దేవత నవ్వింది.

గాజులు లూజు లూజుగా జారిపోయేటట్లు చేతులకు తొడిగాడు.

లత చేతులు గల గలలాడించింది.

తలకాయ పట్టుకొని మెడ మీద మూడు ముళ్ళు వేశాడు.

గోడ మీద లక్ష్మి నవ్వుతూవుంది.

తలుపు తీస్తే ఎదురుగా లక్ష్మి నవ్వుతూవుంది.

లత, శాస్త్రి జబ్బ పట్టుకొని ఆవు దూడను లాక్కుపోయినట్లు ఇంటికి తీసుకుపోయింది.

అమ్మ లిద్దరూ గుడ్లు మిటకరించి చూస్తున్నారు.

నాన్న లిద్దరూ ఉద్యోగులు. ఇళ్ళ దగ్గరలేరు.

తన గదిలోకి తీసుకుపోయి తలుపు గడియ వేసింది.

రెండు రోజులకు తలుపులు తీసి చూస్తే శాస్త్రి పేంట్ వేసుకొన్నాడు! టెర్లిన్ షర్ట్ వేసుకొన్నాడు!

కోరమీసాలు!

క్రాఫ్!

బూటు!

ఇప్పుడు లత, శాస్త్రి కోరినట్టుంది.

శాస్త్రి, లత కోరినట్లున్నాడు.

రామశాస్త్రి, డేనియల్ రోడ్డు మీద ఎదురయ్యారు.

'పిల్లలట' ఇద్దరూ అన్నారు.

'ఇష్టపడి'

'ఏదేదో'

'సరేసరే' ఒకేసారి అన్నారు.

శాస్త్రి సిగరెట్టు ఇచ్చాడు. డేనియల్ అగ్గిపుల్ల వెలిగించాడు.

ఇద్దరూ పొగ వదిలారు.

డేనియల్ మోటారు సైకిల్ స్టార్టుచేశాడు.

శాస్త్రి వెనుక కూర్చున్నాడు

బండి ఆగితే ఒట్టు!

మోటారు సైకిల్ ఇంజనూ పొగ వదిలింది.

భ్రమరం కీటకాన్ని తెచ్చి, భ్రమరాన్ని చేసి పంపుతుందట. అదో న్యాయం.

కీటకం భ్రమరాన్ని తెచ్చి కీటకంచేసి పంపుతుందా? ఇదేం న్యాయం?

భ్రమరం లాంటి శాస్త్రి కొంచెం కీటకమయ్యాడు.

కీటకం లాంటి లత కొంచెం భ్రమరమయ్యింది.

అంతా బాగానే వుంది.

మీరే చెప్పండి!

ఇదేం న్యాయం?

నిజమేమిటంటే -

శాస్త్రీ, లతా ఇంతకు ముందు పసి పిల్లలు! తర్వాత పడుచు పిల్లలు - ఇప్పుడు మనుషులు.